





శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి

# రాష్ట్రాభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరు

● సభ ప్రతిష్ఠను మంటగలిపిన గవర్నర్

ఎన్నో అవరోధాలను ఎదుర్కొని రాటుదేలాం ● అసెంబ్లీలో నిప్పులు చెరిగిన సీఎం స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ తరహా డీఎంకే ప్రభుత్వ పాలనలో శరవేగంగా సాగుతున్న రాష్ట్రాభివృద్ధిని ఎవ్వరూ అడ్డుకోలేరని, ఎన్నో అవరోధాలను అధిగమించి రాటుదేలిన తాము.. ఈ తాటాకు చప్పుళ్లకు బెదిరే ప్రసక్తేలేదని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పష్టం చేశారు. గురువారం శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన ప్రసంగించారు. పాలన అంటే అధికారం చెలాయించడం కాదని, నిర్దేశిత లక్ష్యాలను నెరవేర్చి ప్రజా సంక్షేమాన్ని కాపాడటమే సుపరిపాలన అవుతుందని, ద్రావిడ తరహా పాలన ఆ కోవలోనిదేనని పేర్కొన్నారు. దివంగత నేతలు పెరియార్, అన్నాదురై, కరుణానిధి బాటలోనే తానూ పయనిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఒకప్పుడు అభివృద్ధి ఫలాలు కొన్ని వర్గాలవారికే పరిమితమై ఉండేవని, అయితే డీఎంకే పాలనలో అందరికీ అన్ని సదుపాయాల కల్పన అనే విధానాన్ని అనుసరిస్తున్నామని వెల్లడించారు. కరుణానిధి శతజయంతి వేడుకల సందర్భంగా రాష్ట్రంలో చక్కటి ద్రావిడ తరహా పాలన అందిస్తున్నామన్నారు.

**గవర్నర్ తీరు గర్హనీయం...**

ఈ నెల 12న శాసనసభ సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ సభ కీర్తిప్రతిష్ఠలను దిగజార్చి సభను రాజకీయ వేదికగా వాడుకున్నారని సీఎం ఆరోపించారు. ఏడాది ప్రారంభంలో శాసనసభ సమావే

శాలు గవర్నర్ ప్రసంగంతో ప్రారంభంకావడం ఆనవాయితీ అని, రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదించిన ప్రభుత్వ ప్రసంగాన్ని గవర్నర్ శాసనసభలో యథాతథంగా సభలో పఠించడమే ఆయన బాధ్యత అని గుర్తు చేశారు. అయితే గత రెండేళ్లుగా గవర్నర్ తన రాజకీయ కార్యకలాపాల కోసం శాసనసభను వేదికగా ఎంచుకున్నారేమోననే అనుమానం కలుగుతోందన్నారు. గవర్నర్ ప్రవర్తన వల్ల ఎమ్మెల్యేలకు ఎలాంటి నష్టం లేదని, అయితే శతాబ్దాల చరిత్ర కలిగిన శాసనసభ కీర్తి ప్రతిష్ఠలకు తీరని అవమానం కలిగే విధంగా గవర్నర్ వ్యవహరించడం గర్హనీయమని ధ్వజమెత్తారు. రాజ్యాంగ ధర్మాసనానికి వ్యతిరేకంగా, తాను చేసిన పదవీ ప్రమాణానికి వ్యతిరేకంగా గవర్నర్ నడుచుకుంటున్నట్లు స్పష్టమవుతోందన్నారు. డీఎంకే పాలకులు ఇలాంటి అడ్డంకులను ఎన్నింటినో దాటుకుని ముందుకు సాగారని, ఆ రీతిలోనూ తాము కూడా ఈ అడ్డంకులను అధిగమించేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. గవర్నర్ కుప్పిగంతులకు ఏమాత్రం భయపడే ప్రసక్తేలేదని పాలక పక్ష సభ్యులు హర్షధ్వానాల నడుమ ప్రకటించారు.

**జీఎస్టీ బకాయిల నిలిపివేత...**

ఈ యేడాది ఆరంభంలో ఎనిమిది జిల్లాల్లో తుఫాను వరద పరిస్థితులు సంభవిస్తే బాధితులపై కేంద్రం కరుణించకుండా రాష్ట్రానికి వరద సహాయ నిధులు విడుదల చేయకుండా మొండి వైఖరి అవలంభిస్తోందని స్టాలిన్ ధ్వజమెత్తారు. 2022 జూన్ 30 నుంచి కేంద్రం జీఎస్టీ బకాయిలను నిలిపివేసిందని, దీంతో రాష్ట్రానికి యేటా 20 వేల కోట్ల మేర నష్టం కలుగుతోందన్నారు. ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాలపై కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందన్నారు. మదురై ఎయిమ్స్ ఆస్పత్రికి సంబంధించి కేంద్రం నుంచి వచ్చే ప్రకటనలన్నీ సామాన్యులకు సైతం నవ్వు తెప్పిస్తున్నాయని, ఇప్పటివరకూ ఆ ఆస్పత్రికి సంబంధించి ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టలేదన్నారు. గతంలో మెట్రో ప్రాజెక్టును వ్యతిరేకించిన అన్నాడీఎంకే సభాపక్ష నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ప్రస్తుతం మెట్రోరైలు ప్రాజెక్టుకు మద్దతు తెలపడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. మెట్రోరైలు ప్రాజెక్టుకు నిధులివ్వాలని తాను పలుమార్లు ప్రధాని మోదీని స్వయంగా కలుసుకుని విజ్ఞప్తి చేసినా కేంద్రం నుంచి చిల్లిగవ్వ రాలేదన్నారు. ఈ నేపథ్యంలో రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టుకు కేంద్రం నిధులు విడుదల చేయాలని కోరుతూ తమ ప్రభుత్వానికి ఈపీఎస్ మద్దతివ్వాలని పిలుపునిచ్చారు.

**ఎన్నో పథకాలు అమలు చేశాం...**

తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి 33 నెలలవుతోందని, ఈ స్వల్పకాలంలోనే తమ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి పథకాలను అమలు చేసిందన్నారు. దేశ ఆర్థిక ప్రగతికి 9 శాతం అభివృద్ధి ఫలాలను అందించే రాష్ట్రంగా తమిళనాడు పేరుగడించిందన్నారు. ఇదే ద్రావిడ తరహా పాలన తొలి విజయమన్నారు. దేశంలోని సమస్త స్వదేశీ ఉత్పత్తి (జీడీపీ)లో రాష్ట్రం రెండో స్థానంలో ఉందని, ఇది ద్రావిడ తరహా మలివిజయమన్నారు. జాతీయ స్థూల అభివృద్ధి 7.24 శాతం ఉంటే, రాష్ట్ర స్థూల అభివృద్ధి 8.19 శాతం ఉండటం తమ పరిపాలను సాధించి మూడో విజయమన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతిలో రాష్ట్రం ప్రథమస్థానంలో ఉందన్నారు. పారిశ్రామిక పెట్టుబడులకు అనువైన ప్రాంతంగా గతంలో రాష్ట్రం 14వ స్థానంలో ఉండేదని, డీఎంకే అధికారంలోకి వచ్చా మూడో స్థానానికి చేరిందన్నారు. విద్యారంగంలో దేశంలోనే రాష్ట్రం ద్వితీయ స్థానంలో ఉందన్నారు. తమ రాష్ట్రం ఉత్తరాది రాష్ట్రాలకు దీటుగా అభివృద్ధి చెందుతున్నదన్నదే అక్షర సత్యమని స్టాలిన్ స్పష్టం చేశారు.

**మహిళాభ్యుదయంలోనూ ముందంజ...**

మహిళాభ్యుదయంలోనూ రాష్ట్రం ముందంజలో ఉందని పొరుగు రాష్ట్రాలు, ఉత్తరాది రాష్ట్రాల పాలకులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారన్నారు. కలైంజర్ మహిళా సాధికారిక పథకం కింద ప్రతినెలా రాష్ట్రమంతటా 1.15 కోట్ల మంది గృహిణులు లబ్ధి పొందుతున్నారని సభ్యుల హర్షధ్వానాల నడుమ పేర్కొన్నారు. ఇక ప్రజల వద్దకే వైద్యం పథకం కింద కోటిమందికిపైగా లబ్ధి పొందారని, సీఎం అల్పాహార పథకం కింద 16 లక్షలమంది బడిపిల్లలు లబ్ధి పొందారని, నగల తాకట్టు రుణ మాఫీ కింద 13.12 లక్షల మంది లబ్ధి పొందారని, సహకార రుణాల మాఫీ ద్వారా లక్ష మంది లబ్ధిపొందారని వివరించారు.

## 24న అఖిలపక్షంతో సీఈసీ భేటీ

● లోక్‌సభ ఎన్నికలపై చర్చ

అడయార్, ఫిబ్రవరి 15: త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి రాజీవ్ కుమార్ సారథ్యంలోని సీఈసీ బృందం ఈ నెల 24, 25 తేదీల్లో నగరానికి రానుంది. ఆ సమయంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించి, ఎన్నికల నిర్వహణపై వారి అభిప్రాయాలను సేకరించనుంది. ఇటీవల ఈసీ డిప్యూటీ కమిషనర్ అజయ్ బదు సారథ్యంలో ఇద్దరు అధికారులతో కూడిన ఎన్నికల బృందం నగరానికి వచ్చిన రెండు రోజుల పాటు సమీక్షించింది. ఇందులో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ జరిపిన ఈ బృందం రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి సేకరించిన పూర్తి సమాచారంతో నివేదిక తయారు చేసి సీఈసీకి అందజేసింది. ఈ క్రమంలో ఈ నెల 23వ తేదీ రాత్రికి ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ నేతృత్వంలోని బృందం నగరానికి చేరుకుంటుంది. 24, 25 తేదీల్లో రెండు రోజుల పాటు ఇక్కడే ఉండి ఎన్నికల నిర్వహణ, పోలింగ్ తేదీలు తదితర అంశాలపై రాజకీయ పార్టీల నేతలు, ప్రభుత్వ ఉన్నతాధికారుల అభిప్రాయాలను సేకరించనుంది.

## ఇక మెట్రోరైళ్లలో 'పింక్ స్క్వాడ్'

● ఆకతాయి చేష్టలకు ఫుల్‌స్టాప్
● 25 మందితో మహిళా రక్షణదళం



మహిళా ప్రయాణికుల రక్షణ కోసం ఎంపికైన పింక్ స్క్వాడ్ సభ్యులు

చెన్నై, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో మెట్రోరైళ్లలో ప్రయాణించే మహిళలకు పటిష్ఠమైన భద్రత కల్పించే దిశగా మెట్రోరైలు 'పింక్ స్క్వాడ్' పేరుతో ఓ మహిళా రక్షణ దళాన్ని ఏర్పాటు చేసింది. మెట్రోరైళ్లలో ప్రయాణించిన బాలికలు, యువతులు, విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించి, లైంగిక వేధింపులకు పాల్పడే రోమియోలను గుర్తించి వారికి గుణపాఠం చెప్పటమే ఈ మహిళ రక్షణ దళం ముఖ్యోద్దేశమని మెట్రో సంస్థ నిర్వాహకులు తెలిపారు. చెన్నై మెట్రోరైళ్లలో రోజూ సుమారు 3 లక్షలమంది ప్రయాణిస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం ఈ రైళ్లలో ప్రయాణికులు రద్దీ అధికంగా ఉంటోంది. ముఖ్యంగా విద్యార్థినులు, బాలికలు, ఉద్యోగినులు ఆ సమయాల్లో మెట్రో రైళ్లలో అధికంగా ప్రయాణిస్తుంటారు. ఆ సందర్భంగా ఆకతాయిలు, లేడీస్ బోగీలో చొరబడి వారి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో మెట్రో సంస్థ మహిళా ప్రయాణికులు నిర్భయంగా రైళ్లలో ప్రయాణించేందుకు ఈ పింక్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపింది. ప్రస్తుతం ఈ స్క్వాడ్‌లో కరాటే శిక్షణ పొందిన 25 మంది యువతులను నియమించారు. వీరంతా మెట్రోరైళ్లలో షిఫ్ట్ పద్ధతిలో మహిళా ప్రయాణికులకు రక్షణ కల్పిస్తారు. ఈ పింక్ స్క్వాడ్ సేవలు 24 గంటల పాటు మహిళా ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని అధికారులు చెప్పారు.

## రాష్ట్ర ఎన్నికల అధికారి పదవీకాలం పొడిగింపు

● చట్ట సవరణకు అసెంబ్లీ ఆమోదం

చెన్నై, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల అధికారి పదవీ కాలాన్ని పొడిగిస్తూ శాసనసభలో ప్రభుత్వం ప్రతిపాదించిన చట్టాన్ని శాసనసభ గురువారం ఆమోదించింది. రాష్ట్ర ఎన్నికల అధికారి పదవీకాలం క్రమబద్ధీకరణ చట్ట సవరణ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. 1994 రాష్ట్ర పంచాయతీల చట్టం ప్రకారం రాష్ట్ర ఎన్నికల అధికారి పదవీ కాలాన్ని రెండేళ్లుగా నిర్ణయించారు. అదే సమయంలో మళ్ళీ రెండుమార్లు అంటూ నాలుగేళ్లపాటు పదవీ కాలాన్ని ప్రభుత్వం పొడిగించే వెసులుబాటు ఆ చట్టంలో కల్పించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల పదవీ కాలాన్ని బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఐదేళ్లుగా నిర్ణయిస్తూ ప్రభుత్వం చట్ట సవరణ చేసింది. ఈ సవరణ చట్టం ప్రకారం ఎన్నికల అధికారి పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ఐదేళ్ల వరకూ లేదా సంబంధిత అధికారికి 65 యేళ్ల వయసు వచ్చేవరకు ఆ పదవిలో కొనసాగేలా ఆస్కారం కల్పించారు. ఈ చట్ట సవరణ శాసనసభలో గురువారం ఏకగ్రీవంగా ఆమోదించినట్లు స్పీకర్ అప్పావు ప్రకటించారు.

# మా ప్రశ్నలకు సమాధానమేదీ?

● ప్రతిపక్ష నేత ఎడప్పాడి



మీడియాతో మాట్లాడుతున్న పళనిస్వామి

ప్యారీస్, ఫిబ్రవరి 15: ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాలపై తాను అసెంబ్లీలో అడిగే ప్రశ్నలకు సంబంధిత మంత్రులు కానీ, ముఖ్యమంత్రి కానీ ఎలాంటి సమాధానం చెప్పడం లేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) పేర్కొన్నారు. సెయింట్ జార్జికోటలోని సచివాలయ ప్రాంగణంలో గురువారం పళనిస్వామి మీడియాతో మాట్లాడారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా వ్యవహరించిన తాను ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి మారుమూల పల్లెల్లో సైతం 42 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించానని, అయితే డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నరేళ్లలో రాష్ట్రంలో ఒక కొత్త ప్రభుత్వాసుపత్రి, వైద్య కళాశాలను ప్రారంభించలేదన్నారు. ఆరోగ్య శాఖకంటూ ప్రభుత్వం ఏర్పాటుచేసిన 52 బృందాలు ఏంచేస్తున్నాయో ప్రజలకు తెలిసేలా శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి చేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవన్నారు. అయితే ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం ప్రతిపక్ష సభ్యులు అడిగే ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పకుండా అవాస్తవాలను సభకు తెలియజేస్తున్నారని, ఇది సభను అవమానించడమేనన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల డీఎంకే మెనిఫెస్టోలో ప్రకటించిన హామీల్లో సుమారు 10 శాతం మాత్రమే అమలుపరచిన ప్రభుత్వం, మిగతా హామీల గురించి ప్రజలకు వివరణ ఇవ్వాలని ఈపీఎస్ డిమాండ్ చేశారు.



పట్టాలు తప్పిన బోగీలు

## నగరంలో ఒకేరోజు రెండు రైలు ప్రమాదాలు

● బేసిన్ బ్రిడ్జి సమీపంలో పట్టాలు తప్పిన రైలింజన్, బోగీలు

పెరంబూర్, ఫిబ్రవరి 15: స్థానిక బేసిన్ బ్రిడ్జి సమీపంలో గూడ్సు రైలు పట్టాలు తప్పింది. స్థానిక తండయార్‌పేటలోని ఐఓసీ కర్మాగారం నుంచి గూడ్సు వ్యాగన్లలో పెట్రోల్, డీజిల్ నింపి పలు ప్రాంతాలకు సరఫరా చేస్తుంటారు. ఆ ప్రకారం గురువారం వేకువజామున 2.30 గంటల ప్రాంతంలో యార్డు నుంచి ఖాళీ బోగీలు కర్మాగారానికి తీసుకొస్తున్న సమయంలో బేసిన్ బ్రిడ్జి సమీపంలో రెండు బోగీలు రైలు పట్టాలపై నుంచి కిందకు దిగాయి. ఈ సమాచారం అందుకున్న అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకొని బోగీలను తిరిగి పట్టాలపైకి తీసుకొచ్చేందుకు శ్రమించారు. సుమారు 50 మంది కార్మికులతో పనులు చేపట్టి ఉదయం 7 గంటల ప్రాంతంలో పట్టాలు తప్పిన చక్రాలను సరిచేసి వ్యాగన్లను యార్డుకు తరలించారు.

**రైలింజన్...**

చెన్నై సెంట్రల్-బేసిన్ బ్రిడ్జి సమీపంలో యార్డ్ నుంచి వస్తున్న రైలింజన్ బుధవారం రాత్రి 11 గంటల సమయంలో పట్టాలు తప్పింది. సమాచారం అందుకున్న అధికారులు, సిబ్బందితో అక్కడకు చేరుకొని రెండు గంటల శ్రమించి రైలింజన్‌ను తిరిగి పట్టాలపై చేర్చారు. ఈ ఘటన కారణంగా యార్డు నుంచి రైళ్లు రావడంలో జాప్యం జరిగింది.

## పుదుచ్చేరి ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం

● ప్రారంభించిన సీఎం రంగస్వామి



విద్యార్థులతో ముఖ్యమంత్రి రంగస్వామి

పుదుచ్చేరి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చిరుధాన్యాలతో తయారుచేసే అల్పాహార పథకాన్ని ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి ప్రారంభించారు. ఈ పథకానికి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై గత ఏడాది నవంబరు 25న అనుమతులిచ్చారు. దీంతో తిరుకానూర్ సమీపంలోని కాటేరుకుప్పం ఇందిరా గాంధీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నమశ్శివాయం అల్పాహార పథకం గురించి ప్రకటించారు. చిన్నారులకు అల్పాహారం వడ్డించిన సందర్భంగా ముఖ్యమంత్రి రంగస్వామి మాట్లాడుతూ... కరోనా మహమ్మారి అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న ప్లస్ వన్, ప్లస్ టూ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెంచేలా ప్రభుత్వ పాఠశాలల్లో చిరుధాన్యాలతో తయారుచేసే వంటకాలను పంపిణీ చేయడం తృప్తికరంగా ఉందన్నారు. ఈ పథకం ద్వారా సుమారు 86 వేల మంది విద్యార్థినీ, విద్యార్థులు లబ్ధిపొందుతారని, అల్పాహారం మాత్రమే కాకుండా వారంలో రెండు రోజులు రాగులు, జొన్నలు, సజ్జలు తదితర చిరుధాన్యాల పోషకాలు కలిగిన 20 గ్రాముల బిస్కెట్, మిఠాయిలు కూడా 486 ప్రభుత్వ పాఠశాలల్లో అమలుపరుస్తున్నట్లు సీఎం రంగస్వామి తెలిపారు.

## నేడు భారత్ బంద్

● డ్రైవర్లు, కండక్టర్లు విధులకు హాజరుకావాల్సిందే
● రవాణా శాఖ ఆదేశం

ప్యారీస్, ఫిబ్రవరి 15: కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికుల సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం దేశవ్యాప్తంగా భారత్ బంద్ చేపట్టనున్న నేపథ్యంలో, ప్రభుత్వ రవాణా శాఖ గురువారం రవాణా కార్మికులకు ఉత్తర్వులు జారీచేసింది. బంద్‌లో పాల్గొనకుండా తప్పనిసరిగా విధులకు హాజరుకావాలని లేకుంటే శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించింది. కార్మిక సంఘాల పిలుపు మేరకు భారత్ బంద్‌కు అన్ని రాష్ట్రాల్లోని కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించడంతో పాటు శుక్రవారం విధులు బహిష్కరించి రాస్తారోకో, ధర్నా తదితర నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. రాజధాని నగరం అన్నాసాలైలో ఉన్న ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట కార్మికుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ప్రభుత్వ రవాణా సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు పాల్గొంటారని, అందువల్ల బస్సు సేవలకు అంతరాయం ఏర్పడే అవకాశముందని తెలిసింది. భారత్ బంద్ రోజు యథావిధిగా బస్సు సర్వీసులు కొనసాగించేలా రాష్ట్రప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా చెన్నై మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆల్బీ జాన్ వర్గీస్ బస్సు డిపో మేనేజర్లు, అధికారులకు ఓ సర్క్యులర్ జారీ చేశారు. అదే విధంగా ఎస్ఈటీసీ డ్రైవర్లు, కండక్టర్లకు కూడా సర్క్యులర్ జారీ అయింది. భారత్ బంద్‌లో పాల్గొనకుండా విధులకు హాజరయ్యే సిబ్బందిపై దాడులకు పాల్పడినా, సమ్మెలో పాల్గొనాలని ఒత్తిడి చేసినా సంబంధితులపై క్రమశిక్షణ చర్యలుంటాయని హెచ్చరికలు జారీ అయ్యాయి.

## సమాచార దర్శిని

### థాడ్కో స్వర్ణోత్సవాల స్టాంప్ విడుదల

ఐసిఎఫ్, ఫిబ్రవరి 15: తమిళనాడు ఆదిద్రావిడ గృహవసతి, అభివృద్ధి సంస్థ (థాడ్కో) 50వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేక పోస్టల్ స్టాంప్ విడుదల చేశారు. స్థానిక ఎమ్మార్సీ నగర్ ఇమేజ్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో థాడ్కో ప్రత్యేక స్టాంప్‌ను మంత్రి కమల్‌విళి విడుదల చేయగా, థాడ్కో అధ్యక్షుడు మదివానన్ అందుకున్నారు.

### మార్చి వరకు బిట్రగుంట ఎక్స్‌ప్రెస్ రద్దు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 15: చెన్నై సెంట్రల్, ఆంధ్ర రాష్ట్రం బిట్రగుంట ట్రైన్ సర్వీసులను మార్చి వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. దక్షిణ రైల్వే పరిధిలోని విజయవాడ జోన్‌లో రైలు మార్గం అభివృద్ధి పనులు ఈ నెల 16 నుంచి మార్చి 31వ తేది వరకు జరుగనుండడంతో కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల వేళల్లో మార్పులు చేపట్టారు. బిట్రగుంట-చెన్నై సెంట్రల్-బిట్రగుంట రైళ్లు ఈ నెల 26 నుంచి మార్చి 31వ తేది వరకు రద్దుచేసినట్లు అధికారులు తెలిపారు.

### ఎంసీహెచ్‌ఎం జేఈఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 15: ఎంసీహెచ్‌ఎం ప్రవేశపరీక్షకు మార్చి 31వ తేది వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎన్టీఏ తెలిపింది. జాతీయ ఆహార నిర్వహణ, ఆహార సాంకేతిక సంస్థ ఆధ్వర్యంలో పనిచేసే విద్యా కేంద్రాల్లో బీఎస్సీ ఫుడ్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో చేరేందుకు ఈ ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశ పరీక్ష మే 11వ తేది ఆన్‌లైన్‌లో జరుగనుంది. ఆసక్తి ఉన్న వారు /exams. nta.ac.in/NCHM/ వెబ్‌సైట్‌లో మార్చి 31వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. సవరణలకు ఏప్రిల్ 2 నుంచి 5వ తేది వరకు అవకాశం కల్పించారు. వివరాలకు 011-40759000 అనే నెంబరు సంప్రదించాలని ఎన్టీఏ తెలిపింది.

### రాఘవేంద్ర పార్క్‌లో పుస్తక పఠన కేంద్రం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 15: స్థానిక రాయపురం మండలం రాఘవేంద్ర పార్క్‌లో పుస్తక పఠన కేంద్రాన్ని చెన్నై కార్పొరేషన్ ప్రారంభించింది. ప్రజల్లో పుస్తక పఠనం ప్రోత్సహించేలా పార్క్‌ల్లో పఠనా కేంద్రాలు ఏర్పాటుచేసేందుకు కార్పొరేషన్ నిర్ణయించింది. తొలివిడతగా పది పార్కుల్లో ఈ కేంద్రాలు ఏర్పాటుకాగా, అందులో రాయపురం మండలం ఏపీ రోడ్డులో ఉన్న రాఘవేంద్ర పార్క్‌లో పుస్తక పఠన కేంద్రాన్ని కార్పొరేషన్ ప్రారంభించింది.

### సహకార సంఘ కార్యదర్శుల బదిలీకి ఉత్తర్వులు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 15: సహకార సంఘ కార్యదర్శుల బదిలీకి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు వంటి వాటిలో 1,715 ఉద్యోగుల సహకార రుణ, పొదుపు సంఘాలున్నాయి. వాటిని కార్యదర్శులు నిర్వహిస్తున్నారు. సంఘాల సభ్యులకు రుణాలు అందజేయడంలో అవినీతి జరిగినప్పటికీ కార్యదర్శులను బదిలీ చేయలేని పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఆ విధానం మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇకపై కార్యదర్శులను ఒక సంఘం నుంచి మరో సంఘానికి బదిలీ చేయవచ్చని అధికారులు తెలిపారు.

### వైద్యపరీక్షలు వీడియో తీయాలి

ఐసిఎఫ్, ఫిబ్రవరి 15: వైద్యపరీక్షలు జరిగే సమయంలో గంట పాటు వీడియో నమోదుచేయాలని వైద్యకళాశాలలకు జాతీయ వైద్య కమిషన్ సూచించింది. ఈ మేరకు వైద్య విద్య బోర్డు డైరెక్టర్ సెంబుచరణ్‌కుమార్ విడుదల చేసిన ప్రకటనలో... అన్ని వైద్యకళాశాలలు, విద్యాసంస్థలు, డీమ్డ్ వర్సిటీలలో నిర్వహించే పరీక్షలు పారదర్శకంగా ఉండాలని, పీజీ పరీక్షా సూపరింటెండెంట్లు పరీక్షా విధానాల అధ్యక్షుడిగాను, మూల్యాంకనదారులుగా వ్యవహరించాలన్నారు. నమోదుచేసిన వీడియో వివరాలు కమిషన్‌కు పంపించాలని తెలిపారు.

### టీచర్లకు వైద్యపరీక్షలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 15: ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు 50 ఏళ్లు పైబడిన వారికి మూడేళ్లకు ఒకసారి ఫుల్ బాడీ చెకప్ చేసేందుకు ఆరోగ్యశాఖకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రాష్ట్రప్రభుత్వ పాఠశాలల్లో 50 ఏళ్లకు పైబడిన ఉపాధ్యాయులు 1.06 లక్షల మంది, అంతకన్నా తక్కువ వయస్సు కలిగిన వారు 1.17 లక్షల మంది విధులు నిర్వహిస్తున్నారు. వారిలో తొలి విడతగా 50 ఏళ్లు పైబడిన వారికి మూడేళ్లకు ఒకసారి తప్పనిసరిగా వైద్యపరీక్షలు నిర్వహించాలని, ఒక్కో ఉపాధ్యాయులకు రూ.1,000 వంతున వైద్యపరీక్షలకు రూ.3.56 కోట్లను ప్రభుత్వం కేటాయించింది.

### ఏప్రిల్ నుంచి ఖాళీ మద్యం సీసాల సేకరణ పథకం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 15: రాష్ట్రవ్యాప్తంగా అన్ని మద్యం దుకాణాల్లో ఖాళీ మద్యం సీసాలు వెనక్కి తీసుకొనే పథకాన్ని టాస్మాక్ సంస్థ ఏప్రిల్ నుంచి అమలుచేయనుంది. 4,820 దుకాణాల ద్వారా ఈ సంస్థ మద్యం రకాలు విక్రయిస్తోంది. మద్యం సేవించిన అనంతరం ఖాళీ సీసాలను రహదారులపై పారవేయడాన్ని అడ్డుకొనేలా కొత్త పథకాన్ని టాస్మాక్ సంస్థ రూపొందించింది. నీలగిరి, పెరంబలూరు, కోయంబత్తూర్, తిరువారూర్, నాగపట్టణం, ధర్మపురి, తేని, కన్నియాకుమారి జిల్లాల్లో ఈ పథకం అమలులో ఉండగా, ఖాళీ సీసాలు తిరిగి అందజేసే వారికి రూ.10 దుకాణదారులు అందజేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని విస్తరింపజేసేందుకు చర్య లు చేపట్టిన టాస్మాక్ ఏప్రిల్ నుంచి అన్ని దుకాణాలకు ఈ విధానం అమలుపరచనుంది.

### పళవేర్కాడులో అరుదైన బాతుల వేట

ఐసిఎఫ్, ఫిబ్రవరి 15: తిరువళ్లూర్ జిల్లా పళవేర్కాడు ప్రాంతంలో వలస వచ్చే పక్షుల్లో కొన్నిరకాల అరుదైన బాతులను గుర్తుతెలియని వ్యక్తులు వేటాడుతున్నారు. దీనిపై అటవీ శాఖ అధికారులు విచారణ జరుపుతున్నారు. రాష్ట్రానికి వలస వచ్చే పలు పక్షుల్లో పళవేర్కాడు జలాశయానికి వచ్చేవి ఎక్కువగా ఉంటాయి. గూడబాతులు, ఫ్లెమింగోలు, వివిధ రకాల కొంగలు వంటి వాటిని సందర్శించేందుకు పర్యాటకులు ఇక్కడకు ప్రతిరోజు వస్తుంటారు. ఈ నేపథ్యంలో, పళవేర్కాడులోని అన్నామలైచేరి సహా పలు ప్రాంతాల్లో బాతులను కొందరు వేటాడుతున్నట్లు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందింది. బుధవారం అధికారులు తనిఖీచేయగా, స్పృహ కోల్పోయి ఉన్న బాతులు స్వాధీనం చేసుకొని వైద్యపరీక్షలకు తరలించారు. వీటిని చుట్టుపక్కల వారు మాంసం కోసం వేటాడుతున్నట్లు తెలియడంతో ఆ ప్రాంతంలో అధికారులు విచారణ జరుపుతున్నారు.

### పన్ను చెల్లించని మూడు కర్మాగారాలకు సీలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 15: మరమలైనగర్ మున్సిపాలిటీలో పన్ను చెల్లించని మూడు కర్మాగారాలకు అధికారులు సీలు వేశారు. ఈ మున్సిపాలిటీలో పన్ను చెల్లించని ఇళ్లు, దుకాణాలు, కర్మాగారాలు, విద్యాసంస్థలపై మున్సిపల్ యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో ఆ ప్రాంతంలోని మూడు కర్మాగారాలకు అధికారులు సీలు వేశారు.

# చెన్నై-బెంగళూరు డబుల్ డెక్కర్‌లో అన్‌రిజర్వ్‌డ్ బోగీలు



ప్యారీస్, ఫిబ్రవరి 15: చెన్నై-బెంగళూరు మధ్య నడుపుతున్న డబుల్ డెక్కర్ ఏసీ ఎక్స్‌ప్రెస్‌లో కొత్త వసతులు కల్పించారు. విదేశాల్లో నడుపుతున్న రైళ్లలో లాగే అందంగా డిజైన్ చేసిన ఎయిర్ కండిషన్ బోగీలు, చైర్‌కార్ తదితర అత్యాధునిక వసతుల మధ్య ప్రయాణం చేయడానికి పర్యాటకులు ఉత్సాహం చూపుతున్నారు. చెన్నై సెంట్రల్, అరక్కోణం, కాట్పాడి, ఆంబూరు, వాణియంబాడి. జోలార్‌పేట, కుప్పం, బంగారుపేట, కృష్ణరాజపురం, బెంగళూరు కంటోన్మెంట్, బెంగళూరు సిటీ జంక్షన్లలో ఈ రైలు ఆగుతుంది. సుమారు 360 కి.మీ దూరాన్ని ఆరు గంటల వ్యవధిలోనే చేరుకుంటున్న ఈ రైలులో రిజర్వేషన్ లేని ఆర్డినరీ బోగీలను జతచేయాలని ప్రయాణికులు దక్షిణ రైల్వే శాఖకు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన రైల్వే అధికారులు ఏసీ రహిత చైర్‌కార్ బోగీలు ఐదు, ఒక అన్‌రిజర్వ్‌డ్ బోగీ, లగేజీ బోగీ మొత్తం 15 బోగీలతో కూడిన చెన్నై-బెంగళూరు డబుల్ డెక్కర్ రైలు బుధవారం నుంచి అందుబాటులోకి వచ్చింది. కాగా, తక్కువ చార్జీతో డబుల్ డెక్కర్ రైలులో ప్రయాణం చేసేందుకు అవకాశం కల్పించడంపై సామాన్య ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 22న పుదుచ్చేరి అసెంబ్లీలో తాత్కాలిక బడ్జెట్

పుదుచ్చేరి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి ప్రభుత్వం ఈ నెల 22న అసెంబ్లీలో తాత్కాలిక బడ్జెట్ దాఖలుచేయనుంది. కేంద్రపాలిత రాష్ట్రమైన పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశాలు మార్చి 9వ తేది గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం కానున్నాయి. అసెంబ్లీలో పూర్తిస్థాయి బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఆర్నెళ్లకు ఓసారి అసెంబ్లీని సమావేశపరచాలన్న నిబంధనల కారణంగా గత సెప్టెంబరు 9న ఒకరోజు మాత్రమే అసెంబ్లీ సమావేశమైంది. ఈ నేపథ్యంలో, పార్లమెంటు ఎన్నికలు దగ్గర పడుతున్న కారణంగా వచ్చే మార్చిలో పూర్తిస్థాయి బడ్జెట్ దాఖలుచేయలేని పరిస్థితి నెలకొంది. అందువల్ల ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నిధులు, ఖర్చులకు అనుమతి పొందేందుకు ఈ నెల 22వ తేది ఉదయం పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశం కానుంది. ఆరోజు ఆర్థిక బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యంత్రి ఎన్.రంగస్వామి 2024-25వ వార్షిక తాత్కాలిక బడ్జెట్ దాఖలుచేస్తారు. తాత్కాలిక బడ్జెట్ సమావేశాలకు అఖిలపక్ష ఎమ్మెల్యేలందరూ పాల్గొనాల్సిందిగా సభాపతి ఏంబలం సెల్వం పిలుపునిచ్చారు.

## కార్చిచ్చును అడ్డుకొనేందుకు నిఘా



మంచెపై టెలిస్కోప్‌తో పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది

ఐసిఎఫ్, ఫిబ్రవరి 15: నీలగిరి జిల్లా ముదుమలై పులుల శరణాలయంలో కార్చిచ్చు అడ్డుకొనేందుకు అటవీ శాఖ సిబ్బంది చెట్లపై మంచెలు ఏర్పాటుచేసి నిఘా వేస్తున్నారు. ముదుమలై పులుల శరణాలయంలో నీటి ఎద్దడి నెలకొనడంతో గడ్డి, చెట్లు ఎండిపోతున్నాయి. ఈ కారణంగా అప్పుడప్పుడు చెట్ల రాపిడికారణంగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ కార్చిచ్చును ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వస్తుండడంతో, ముందు జాగ్రత్త చర్యగా వాటి నియంత్రణపై అటవీ శాఖ చర్యలు చేపట్టింది. ఈ విషయమై అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ... చెట్లపై మంచె ఏర్పాటుచేసి టెలిస్కోప్, బైనాక్యులర్ సహాయంతో మంటలు చెలరేగడాన్ని పసికట్టి వెంటనే వెళ్లి ఆర్పుతున్నామన్నారు.

## పార్లమెంటు ఎన్నికలు.... 19 నుంచి డీఎంకే తరపున పోటీకి దరఖాస్తులు

ప్యారీస్, ఫిబ్రవరి 15: పార్లమెంటు ఎన్నికల్లో డీఎంకే తరపున పోటీచేయదలచుకున్న ఆశావాహులు ఈ నెల 19వ తేది నుంచి దరఖాస్తు పొందవచ్చని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ మంత్రి దురైమురుగన్ ప్రకటించారు. తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయం గురువారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. అన్నా అరివాలయంలో పొందే దరఖాస్తులు పూర్తిచేసి మార్చి 1వ తేది నుంచి 7వ తేది వరకు సాయంత్రం 6 గంటల్లోపు పార్టీ ప్రధాన కార్యాలయంలో సమర్పించాలని, అభ్యర్థిగా పోటీచేయదలచిన వారు రూ.2,000 చెల్లించి దరఖాస్తు పొందాల్సిందిగా ప్రకటనలో తెలిపారు.

## కొనసాగిన అంధ విద్యార్థుల రాస్తారోకో



విద్యార్థులను లాక్కెళ్తున్న పోలీసులు

ప్యారీస్, ఫిబ్రవరి 15: తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎన్‌పీఎస్సీ)లో అంధులకు ప్రత్యేక పరీక్ష నిర్వహించి, అన్ని శాఖల్లో ఒక శాతం రిజర్వేషన్ ప్రాతిపదికన 1,000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ అంధ విద్యార్థుల సంఘం ఈ నెల 12న చేపట్టిన రాస్తారోకో గురువారం కూడా కొనసాగింది. వెప్పేరి పోలీస్ కమిషనర్ కార్యాలయం సమీపంలోని పూందమల్లి హైరోడ్డులో పడుకున్న అంధ విద్యార్థులు, తమ కోర్కెలను ప్రభుత్వం నెరవేర్చాలంటూ రాస్తారోకోలో పాల్గొన్నారు. దీని కారణంగా ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రంగంలో దిగిన పోలీసులు ఆందోళన చేస్తున్న వారిని పోలీసు వాహనంలో ఎక్కించి పంపించారు.

## గ్రామీణ మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ



టైలరింగ్ శిక్షణలో పాల్గొన్న మహిళలు


ప్యారీస్, ఫిబ్రవరి 15: వెనుకబడిన సామాజిక వర్గం మహిళలకు సాధికారిత కల్పించే విధంగా ఇళ్ల వద్దే టైలరింగ్, ఎంబ్రాయడరీ తదితర శిక్షణ పథకానికి అల్ట్రా టెక్ సంస్థ శ్రీకారం చుట్టింది. సుమారు 500 గ్రామాల్లో ఈ శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. అరక్కోణం ప్రాంతంలో ఎంపిక చేసిన 2,000 మంది మహిళలకు అనుభవజ్ఞులైన శిక్షకుల ద్వారా ట్రైనింగ్ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. అమ్మయప్పర్ టెక్స్‌టైల్ సహకారంతో మరికొన్ని వస్త్ర ఉత్పత్తి సంస్థల్లో శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఆదిత్య బిర్లా సెంటర్ ఫర్ కమ్యూనిటీ ఇన్నివేటివ్స్ చైర్‌పర్సన్ రాజశ్రీ పేర్కొన్నారు.

## పోలీసులు ప్రశ్నించడంతో ఆగిన బీజేపీ తామరయాత్ర

చెన్నై, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పాదయాత్రకు అనుమతివ్వని నగర పోలీసుల నుంచి కడలిలో తామర యాత్ర పేరిట తలపెట్టిన పడవల యాత్ర అనుమతి కోసం ప్రయత్నించిన ఆ పార్టీ జాలర్ల సంఘం నాయకులు చుక్కెదురైంది. పోలీసులు ప్రశ్నల వర్షానికి ఆ నాయకులంతా బెంబేలెత్తారు. నగరంలోని నీలాంగరై నుంచి పాలవాక్కం వరకూ సుమారు 300 పడవలతో గురువారం ఉదయం 'తామరయాత్ర' నిర్వహించేందుకు బీజేపీ జాలర్ల సంఘం నాయకులు పోలీసులకు దరఖాస్తు చేశారు. కడలిలో పడవల ప్రయాణం కనుక పోలీసులు సులువుగా అనుమతిస్తారని ఆ నాయకులు ఆశపడ్డారు. అయితే పోలీసులు అనుమతివ్వడానికి ముందు ఓ ప్రశ్నపత్రాన్ని వారి ముందుంచారు. ఆ పత్రంలోని ప్రశ్నలను చూసి విస్తుపోయారు. తామరయాత్రలో ఎన్ని పడవలు పాల్గొంటున్నాయి? ఆ పడవలన్నీ మత్స్యశాఖలో రిజిస్టర్ చేసుకున్నవేనా? ఈ యాత్రకు మత్స్యశాఖ అనుమతించిందా? సముద్రతీరంలో జాలర్లు చేరేందుకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అనుమతిచ్చిందా? కడలిలో యాత్ర చేసేందుకు కోస్ట్‌గార్డ్ అనుమతి తీసుకున్నారా? పడవలో ప్రయాణించేవారికి ప్రమాదం ఏర్పడితే వారిని కాపాడేందుకు గజ ఈతగాళ్ల బృందాన్ని సిద్ధం చేసుకున్నారా? అంటూ పోలీసులు వేసిన ప్రశ్నలకు బీజేపీ జాలర్ల సంఘం నాయకులంతా విస్తుపోయారు. ఆ ప్రశ్నల ప్రకారం అనుమతి తీసుకోవడానికి వీలుకాదని గ్రహించిన నాయకులు చివరకు తామరయాత్రను రద్దు చేసుకుని చేతులు దులుపుకున్నారు.

## పళని గిరి వీధుల్లో బ్యాటరీ వాహనాలు నడపాలి

● హైకోర్టు డివిజన్ బెంచ్ ఉత్తర్వులు



చెన్నై, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సుప్రసిద్ధ క్షేత్రం పళని దండాయుధపాణి ఆలయ గిరి వీధుల్లో తిరుమల తరహాలో బ్యాటరీ వాహనాలను నడపాలని హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఉత్తర్వు జారీ చేసింది. పళని ఆలయ స్థలాల ఆక్రమణలను తొలగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై గురువారం జరిగిన విచారణ సందర్భంగా ఆక్రమణలను వీలైనంత త్వరగా తొలగించాలని కోర్టు ఆదేశించింది. అదే సమయంలో ఆలయ గిరి వీధుల్లో బ్యాటరీ వాహనాలు నడిపేందుకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని ఆదేశించింది.

## పదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ పాఠాలు



విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఈరోడ్ జిల్లా కలెక్టర్ రాజగోపాల్

చెన్నై, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా కలెక్టర్ రాజగోపాల్ సుంకర పెరుందురై సమీపంలోని పెరియవీర సంగిలి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సైన్స్‌పాఠాలు బోధించారు. ఆ స్కూలు తనిఖీకి వెళ్ళిన కలెక్టర్ పదో తరగతి విద్యార్థులకు న్యూటన్ నియమాలపై ఆసక్తికరంగా బోధించారు. తరువాత అధ్యాపకులతో కాసేపు గడిపి అక్కడి నుండి ఆయన బయలుదేరి వెళ్ళారు.

## రిజిస్ట్రార్ ఇంట్లో ఏసీబీ తనిఖీలు



కేవీ కుప్పం రిజిస్ట్రార్ రమణ

వేలూరు, ఫిబ్రవరి 15: కేవీ కుప్పం తాలూకా కీల్ వైనాధకుప్పం రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న రమణ, ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఫిర్యాదులందాయి. ఈ వ్యవహారంపై రమణ, ఆయన భార్య సౌందరిపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు కేసు నమోదుచేశారు. ఈ నేపథ్యంలో, కాట్పాడిలోని ఆయన ఇంట్లో గురువారం ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టగా ఆదాయానికి మించి రూ.47.49 లక్షల ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించిన అధికారులు, అందుకు సంబంధించిన రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

## రూ.2.21 కోట్ల విద్యా రుణాల పంపిణీ



విద్యా రుణాలు అందజేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఫిబ్రవరి 15: స్థానిక శంకరన్‌పాళ్యంలోని డీకేఎం కళాశాలలో గురువారం విద్యా రుణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. విద్యా రుణాల కోసం దరఖాస్తు వారిలో 89 మంది ఎంపిక కాగా, వారికి 53 మందికి రూ.2.21 కోట్ల విలువైన రుణాలను కలెక్టర్ సుబ్బులక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ ఆర్తి, మహిళా పథక డైరెక్టర్ తిరునావుక్కరసు, లీడింగ్ బ్యాంక్ మేనేజర్ జమాల్ మొయిద్దీన్, విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ఎయిలన్, ఆదిద్రావిడుల సంక్షేమ శాఖ అధికారి రామచంద్రన్, కళాశాల ప్రిన్సిపాల్ భానుమతి పాల్గొన్నారు.

## రిటైర్డ్ రవాణా కార్మికుల ఆందోళన



ఆందోళనలో మాజీ కార్మికులు

వేలూరు, ఫిబ్రవరి 15: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రిటైర్డ్ కార్మికులు గురువారం ఆందోళన చేపట్టారు. రంగాపురంలోని ప్రధాన కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో ఆ సంఘం వేలూరు మండలం అధ్యక్షుడు భక్తవత్సలం, కోశాధికారి చంద్రన్, సెక్రటరీ గోవిందస్వామి పాల్గొన్నారు. సత్వరం సమస్యలు పరిష్కరించాలంటూ కార్మికులు నినాదాలు చేశారు.

## రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన



స్థానిక గ్రీన్ సర్కిల్‌లో ప్రచార వ్యాన్ ప్రారంభిస్తున్న సైబర్ క్రైం ఏడీఎస్పీ కోటీశ్వరన్

వేలూరు, ఫిబ్రవరి 15: జిల్లా పోలీసు శాఖ, వేలూరు కింగ్స్ ఇయక్కం సంయుక్త ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా నిబంధనలపై ప్రజలు, వాహనచోదకులకు అవగాహన కల్పిస్తూ ప్రచారం చేపట్టారు. స్థానిక గ్రీన్ సర్కిల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎల్ఈడీ స్క్రీన్‌తో కూడిన ప్రచార వాహనాన్ని సెంట్రల్ క్రైం ఏడీఎస్పీ కోటీశ్వరన్ ప్రారంభించారు. వేలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అరివయగన్, జీసీ వెంకటేశన్, జేసీఐ వేలూరు కింగ్స్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ జైన్ సహా పలువురు పాల్గొన్నారు.

## కూరగాయల వ్యాపారి అవయవదానం

● ఎమ్మెల్యే ఎస్ఆర్ రాజా నివాళి

అడయార్, ఫిబ్రవరి 15: ఈస్ట్ తాంబరం గణపతి సుధానంద భారతి వీధికి చెందిన రామచంద్రన్ అలియాస్ కుట్టి (60) అనే కూరగాయల వ్యాపారి బ్రెయిన్ డెడ్ కావడంతో ఆయన కుటుంబ సభ్యులు అవయవదానం చేశారు. దీంతో కుట్టి అంత్యక్రియల్లో స్థానిక ఎమ్మెల్యే ఎస్ఆర్ రాజా పాల్గొన్ని నివాళులర్పించారు. మృతుడు తాంబరం కూరగాయల మార్కెట్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. కొన్ని రోజుల క్రితం ఆయన ఇంటిలోనే కిందపడటంతో తలకు బలమైన దెబ్బ తగిలింది. ఆయనను ఆస్పత్రికి తీసుకెళ్ళగా బ్రెయిన్ డెడ్ అయినట్లు ప్రకటించారు. దీంతో కుటుంబ సభ్యులు కుట్టి అవయవాలను దానం చేసేందుకు ముందుకు రావడంతో రెండు కిడ్నీలు, కాలేయం, నేత్రాలను వైద్యులు సేకరించారు. కుట్టి భౌతికకాయానికి స్థానికులతో పాటు కూరగాయల వ్యాపారులు కూడా భారీ సంఖ్యలో హాజరై నివాళులు అర్పించారు.

## మదురైలో బీజేపీ జిల్లా కార్యదర్శి దారుణహత్య

ప్యారీస్, ఫిబ్రవరి 15: మదురైలో గురువారం ఉదయం బైక్‌పై వెళ్తున్న బీజేపీ జిల్లా కార్యదర్శి శక్తివేల్ (34)ను గుర్తుతెలియని వ్యక్తులు హతమార్చిన సంఘటన ఉద్రిక్తతకు దారితీసింది. మదురై చింతామణి ప్రాంతంలో రైస్ మిల్ నడుపడంతో పాటు ఫైనాన్సర్‌గా కూడా కొనసాగిన శక్తివేల్‌ను పాతకక్షల కారణంగా హతమార్చి ఉంటారని పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది. ఇటీవల ఓ లోడు వాహనం విక్రయించే వ్యవహారంలో ఏర్పడిన విభేదాలా.. శక్తివేల్‌పై కక్ష తీర్చుకున్నారా, మరేదైనా కారణముందా అనే కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



కాట్పాడి తహసీల్దార్‌గా పదవీబాధ్యతలు చేపట్టిన శరవణన్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్న కాట్పాడి డివిజన్ ఇండియన్ రెడ్‌క్రాస్ సంఘం అవై అధ్యక్షుడు జనార్థన్, సెక్రటరీ శివవడివు, కోశాధికారి పళని, ఉపాధ్యక్షుడు శ్రీనివాసన్, సభ్యులు ధీనబంధు, రామచంద్రన్ తదితరులు

## చూలై మీదుగా మరిన్ని సిటీ బస్సులు నడపాలి

● ఎమ్మెల్యే పరంధామన్ వినతి

అడయార్, ఫిబ్రవరి 15: స్థానిక చూలై మీదుగా నగరంలోని ముఖ్య ప్రాంతాలకు ఎంటీసీ సిటీ బస్సులను నడపాలని ఎగ్మోర్ ఎమ్మెల్యే ఇ.పరంధామన్ కోరారు. గురువారం జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ సిటీ బస్సులన్నీ ఎగ్మోర్ నియోజకవర్గం నుంచే వెళుతున్నాయని, అందువల్ల ఈ రూట్లలో మరిన్ని బస్సులను నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



ఆంధ్రప్రదేశ్ చిత్తూరు కార్పొరేషన్ ఉప మేయర్ చంద్రశేఖర్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలుసుకున్న డీఎంకే కాట్పాడి దక్షిణ ప్రాంత ప్రతినిధి సి.నాయుడు బాబు

## పల్లడంలో మోదీ పర్యటన 27కు వాయిదా

పెరంబూర్, ఫిబ్రవరి 15: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై 'ఎన్ మన్.. ఎన్ మక్కల్' పేరుతో రాష్ట్రవ్యాప్త పాదయాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. ఈ పాదయాత్ర తిరుప్పూర్‌లో ముగియనుంది. మరుసటిరోజు పల్లడంలో నిర్వహించనున్న బహిరంగ సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొననున్నారు. ఈ సభ కోసం పల్లడం మాదాపూర్ భారీ వేదిక సిద్ధమవుతోంది. ఈ నెల 24న పాదయాత్ర ముగింపు, 25న బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఇదివరకే ఆ పార్టీ ప్రకటన విడుదల చేసింది. కానీ, ఈ కార్యక్రమాల్లో మార్పులు జరిగాయి. ఈ విషయమై ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురుగానందం మాట్లాడుతూ, పాదయాత్ర ముగింపు, బహిరంగ సభ రెండూ ఈనెల 27వ తేది నిర్వహించనున్నామని తెలిపారు. ప్రధాని మోదీ పాల్గొననున్న బహిరంగసభకు భారీగా కార్యకర్తలు హాజరుకానున్నారని తెలిపారు.

## మేట్టుపాళయం రైల్వేస్టేషన్‌లో అగ్నిప్రమాదం

● సిగ్నల్ యంత్రం దగ్ధం

పెరంబూర్, ఫిబ్రవరి 15: మేట్టుపాళయం రైల్వేస్టేషన్ ఇంజన్ రూంలో సంభవించిన అగ్నిప్రమాదంలో సిగ్నల్ యంత్రం, పలు పరికరాలు దగ్ధమయ్యాయి. కోయంబత్తూర్ జిల్లా మేట్టుపాళయం రైల్వేస్టేషన్ నుంచి ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక కేంద్రం ఊటీకి కొండ రైలు, కోయంబత్తూర్‌కు ప్యాసింజర్ రైలు, చెన్నైకి నీలగిరి ఎక్స్‌ప్రెస్ నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో, బుధవారం రాత్రి రైల్వేస్టేషన్‌లోని ఇంజన్ గదిలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సిగ్నల్ యంత్రం సహా పలు పరికరాలు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా అదుపుచేశారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు విచారిస్తున్నారు.

## రైతు హత్యకేసులో నలుగురికి యావజ్జీవం

పెరంబూర్, ఫిబ్రవరి 15: రైతు హత్యకేసులో నలుగురికి యావజ్జీవశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. దీనికి సంబంధించి వివరాలిలా.. తూత్తుకుడి జిల్లా శ్రీవైకుంఠం సమీపం కొంగరాయకుర్చి ప్రాంతానికి చెందిన మాజీ ఉపాధ్యాయుడు శ్యాం దేవసహాయం, ఈ ప్రాంతంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై పోలీసులకు సమాచారం ఇచ్చారనే విషయం తెలిసిన కొందరు దేవసహాయంపై దాడిచేసి హతమార్చారు.. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ఇరువర్గాల మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో దాడికి పాల్పడిన నిందితులకు ఆ ప్రాంతానికి చెందిన రైతు పిచ్చయ్య (55) సహకరిస్తున్నాడని భావించిన ఆయన మద్దతుదారులు 2015 మార్చి 10వ తేది పిచ్చయ్యను హతమార్చారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన శ్రీవైకుంఠం పోలీసులు అంథోనిరాజ్ (42), రాబిన్ (28), రవి (49), అన్బుపట్టురాజ్ (43), సుబ్బురాజ్ (46), జగన్ రాబర్ట్ (38), విజయ్ (37), ముత్తుపాండి (36), పార్తీపన్, చెల్లప్ప, పిచ్చాండి, సెల్వరాజ్, ఇద్దరు మైనర్ల సహా 14 మందిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో తూత్తుకుడి ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో విచారణ జరుగుతున్న సమయంలో, పార్తీపన్ మృతిచెందగా, ఇద్దరు బాలురపై ఉన్న కేసు విచారణ పిల్లల కోర్టుకు బదిలీ చేశారు. ఈ కేసులో విచారణ పూర్తయిన నేపథ్యంలో న్యాయమూర్తి సెల్వం, నేరారోపణ ఎదుర్కొంటున్న ఆంథోనిరాజ్, రవి, అన్బుపట్టురాజ్,రాబిన్ తదితరులకు యావజ్జీవ శిక్ష విధించి, మిగిలిన ఏడుగురిని నిర్దోషులుగా విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

## లంచం కేసులో తహసీల్దార్‌కు రెండేళ్ల జైలు

పెరంబూర్, ఫిబ్రవరి 15: లంచం తీసుకున్న కేసులో తహసీల్దార్‌కు న్యాయస్థానం రెండేళ్ల జైలుశిక్ష విధించింది. కళ్లకుర్చి జిల్లా ఉళుందూర్‌పేట తాలూకా ఎల్లావసూరుకోటకు చెందిన సిరాజుద్దీన్ 2008 డిసెంబరులో టిప్పర్‌లో కంకరరాళ్లు తరలిస్తుండగా, అప్పటి చిదంబరం తహసీల్దార్‌గా పనిచేస్తున్న కుళందైవేలు లారీని స్వాధీనం చేసుకున్నారు. లారీ విడిపించాలంటే రూ.5,000 లంచం ఇవ్వాలని కుళందైవేలు కోరారు. జనవరి 22న తహసీల్దార్‌కు సిరాజుద్దీన్ నగదు అందజేస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ కేసులో వాదోపవాదనలు ముగియడంతో, నేరం రుజువు కావడంతో కుళందైవేలుకు రెండేళ్ల జైలు, రూ.5,000 జరిమానా విధిస్తూ కడలూరు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ప్రభాకరన్ బుధవారం తీర్పునిచ్చారు.

## రైలు ఢీకొని మహిళా న్యాయవాది మృతి

ప్యారీస్, ఫిబ్రవరి 15: స్థానిక తాంబరం సమీపంలోని పెరుంగళత్తూర్ రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం ఉదయం పట్టాలు దాటేందుకు యత్నించిన మహిళను రైలు ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే మరణించింది. సమాచారం తెలిసి అక్కడకు చేరుకున్న రైల్వే పోలీసులు మృతురాలు హ్యాండ్ బ్యాగ్ తనిఖీ చేయగా, అందులో ఆమె కృష్ణగిరి జిల్లాకు చెందిన అమృతవల్లి అనే న్యాయవాది అని తెలిసింది. ఆమె పెరుంగళత్తూర్ ప్రాంతంలోని ఓ ఇంట్లో అద్దెకుంటూ న్యాయవాదిగా కొనసాగుతున్నారని, రోజులాగే కోర్టుకు వెళ్లే ప్రయత్నంలో దురదృష్టవశాత్తు రైలు ఢీకొని మరణించినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

## కేంద్ర ప్రభుత్వ నిధులు గోల్‌మాల్

● 9 మంది విద్యాశాఖ అధికారులపై కేసు

ప్యారీస్, ఫిబ్రవరి 15: ప్రభుత్వ పాఠశాలల్లో 9,10వ తరగతి చదువుకుంటున్న విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఫర్నిచర్, గ్రంథాలయానికి అవసరమైన పుస్తకాలు, ప్రయోగశాల ఉపకరణాలు కొనుగోలు చేసేందుకు ఆర్‌ఎంఎస్‌ఏ పథకం కింద కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను స్వాహా చేసిన వ్యవహారంలో 9 మంది విద్యాశాఖ అధికారులపై తిరుచ్చి ఏసీబీ అధికారులు కేసు నమోదుచేశారు. తిరుచ్చి జిల్లాలో గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో సీనియర్ విద్యాశాఖ అధికారిగా వ్యవహరించిన అరివళగన్, హెచ్‌ఎం ముత్తుస్వామి, శాంతి, రాజేంద్రన్, సర్గుణం, అఖిల, జయసీరాణి, జయసింగ్, కన్నన్ అనే 9 మందిపై కేసు నమోదుచేసి విచారణకు హాజరుకావాల్సిందిగా గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

## పుదువైలో యువకుడి దారుణ హత్య

పుదుచ్చేరి, ఫిబ్రవరి 15: పుదుచ్చేరిలోని తవలకుప్పంలో బార్‌కు వెళ్ళి వచ్చిన ఒక యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. స్థానిక తవలకుప్పం 5వ వీధికి చెందిన మురుగయ్యాన్ కుమారుడు జగదీశ్వరన్ (21) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇదే ప్రాంతానికి చెందిన మురళి (27)తో అతనికి స్నేహం ఉంది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం వీరిద్దరు మరికొంతమంది స్నేహితులతో కలిసి బార్‌కు వెళ్ళారు. అర్ధరాత్రి వరకు మద్యం సేవించిన వీరంతా ఇంటికి వచ్చారు. ఇంటిలోకి వెళుతున్న జగదీశ్వరన్ తలపై మురళి కట్టెతో బలంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడే ప్రాణాలు కోల్పోయాడు. దీనిపై మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఆస్పత్రికి తరలించి, పరారీలో ఉన్న మురళి కోసం గాలిస్తున్నారు.

## ఏడాదికి 17 శాతం ఇంజనీరింగ్ పట్టభద్రులు

● మంత్రి పీటీఆర్ పళనివేల్ త్యాగరాజన్

అడయార్, ఫిబ్రవరి 15: దేశంలోని రాష్ట్రాల్లో ఒక్క తమిళనాడు రాష్ట్రంలోనే ఒక యేడాదికి 17 శాతం ఇంజనీరింగ్ పట్టభద్రులు కాలేజీల నుంచి వస్తున్నారని రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి పీటీఆర్ పళనివేల్ త్యాగరాజన్ తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గురువారం జరిగిన సభ కార్యక్రమాల ప్రశ్నోత్తరాల సమయంలో విపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. కోయంబత్తూరులోని విలాంకుర్చిలో 61.59 ఎకరాల్లో ఎల్కాట్ సంస్థ ప్రత్యేక ఆర్థిక మండలాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఐటీ కంపెనీలకు అక్కడ లీజు ప్రాతిపదిక స్థలాన్ని కేటాయిస్తున్నామన్నారు. ఇప్పటికే 16802 సిబ్బందితో పలు ఐటీ కంపెనీలు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయని తెలిపారు. అలాగే, మరికొన్ని ఐటీ కంపెనీలకు స్థలం ఇచ్చేందుకు వీలుగా 2.66 లక్షల చదరపుఅడుగుల విస్తీర్ణంలో పక్కా భవనాల నిర్మాణం సాగుతుందన్నారు. రాష్ట్రంలో అత్యధిక శాతం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న శాఖ ఒక్క ఐటీ మాత్రమేనని పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రతి యేటా 17 శాతం మంది ఇంజనీరింగ్ పట్టభద్రులు ఒక్క మన రాష్ట్రం నుంచే కాలేజీల నుంచి బయటకు వస్తున్నారని మంత్రి పళనివేల్ త్యాగరాజన్ వివరించారు.

## అనుమతి లేని బ్యానర్ల తొలగింపు


● బీజేపీ కార్యకర్తల ఆందోళన

అడయార్, ఫిబ్రవరి 15: స్థానిక పెరంబూరులో పోలీసుల అనుమతి లేకుండా భారతీయ జనతా పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన బ్యానర్లను పోలీసు బందోబస్తుతో కార్పొరేషన్ సిబ్బంది తొలగించారు.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై "ఎన్ మణ్ ఎన్ మక్కల్" పేరుతో చేస్తున్న పాదయాత్రలో భాగంగా గత ఆదివారం మింట్ ప్రాంతంలో జరిగిన బహిరంగ సభలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరై ప్రసంగించారు. ఇది లావుంటే, స్థానిక పెరంబూరు, కొళత్తూరు, తిరువిక నగర్ అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో అన్నామలై పాదయాత్ర చేసేలా రూట్ మ్యాప్ ఖరారు చేసుకున్నారు. దీంతో ఆ పార్టీ శ్రేణులు ఆ ప్రాంతాల్లో భారీగా బ్యానర్లు ఏర్పాటుచేశారు. అయితే, వీటికి పోలీసులు అనుమతివ్వలేదు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ సిబ్బంది పోలీసుల బందోబస్తు మధ్య తొలగించారు. దీంతో బీజేపీ కార్యకర్తలు కొందరు ఆందోళనకు దిగి పోలీసులు, కార్పొరేషన్ సిబ్బందికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఆధ్యాత్మికం

తిరువారూరు జిల్లా నన్నిలం సమీపంలోని వాంజియం వాంజినాథస్వామి ఆలయం సుప్రసిద్ధ శైవక్షేత్రంగా కీర్తిగడించింది. సుమారు రెండు వేల యేళ్ళ నాటి ఈ క్షేత్ర మహాత్మ్యాల ప్రస్తావనలు, వ్యాసమహర్షి విరచిత స్కంధ పురాణం, బ్రహ్మాండపురాణంలో ఉన్నాయి. ఈ క్షేత్రంలో దేవతలు, మునులు తపమాచారించారని కూడా స్థలపురాణం చెబుతోంది. ఈ శివాలయంలో యమధర్మరాజు స్వామి వారికి వాహనసేవలందించి తరిస్తున్నారు. అంతే కాదు ఈ క్షేత్రపాలకుడిగా భక్తుల చేత తొలి పూజలు సైతం అందుకుంటున్నారు. అత్యంత ప్రాచీనమైన ఈ ఆలయాన్ని దర్శిస్తే జన్మరాహిత్యం ప్రాప్తిస్తుందని శైవాగమ పండితులు చెబుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, చెన్నై


యమధర్మరాజు సన్నిధి




మంగళనాయకి సమేత వాంజినాథస్వామి

స్వామివారి నామధేయం : శ్రీవాంజినాథస్వామి
అమ్మవారి నామధేయం : మంగళనాయకి
స్థల వృక్షం : చందన వృక్షం
తీర్థం : గుప్తగంగా తీర్థం, యమతీర్థం, మునితీర్థం

### యోగభంగిమలో ...

యోగ భంగిమలో యమధర్మరాజు కొలువుదీరి ఉండటం వల్ల ఆయనను దర్శించేవారికి మరణభయం ఉండదు. కాశీలో ప్రాణాలు విడిస్తే యమ భయం ఉండకపోయినా కొద్ది క్షణాలపాటు యమ దండన అనుభవించాల్సి ఉంటుంది. అయితే శ్రీవాంజియంలో మృతి చెందేవారికి యమ భయం, దండన రెండూ ఉండవు. ఇక్కడ యముడు కూడా యోగ భంగిమలో పరమశివుడిని ఆరాధిస్తున్నారు. యమధర్మరాజు, కాలభైరవుడు అనుగ్రహమూర్తులుగా ఉండటం వల్ల ఈ క్షేత్రం కాశీ కంటే వందరెట్లు ఉన్నతమైనదిగా మహర్షులు చెబుతున్నారు. బ్రహ్మాండపురాణంలో శ్రీవాంజియం క్షేత్రం ప్రస్తావన ఉంది.


చిత్రగుప్తుడు, యమధర్మరాజు


గుప్త గంగాతీర్థం

# యమభయాన్ని పోగొట్టి ముక్తిని ప్రసాదించే శ్రీవాంజియం క్షేత్రం

### కాశీకి దీటైన క్షేత్రం...

కాశీ క్షేత్రం అత్యంత పుణ్యప్రద క్షేత్రంగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచింది అంతటి మహిమాన్వితం కలిగిన కాశీ క్షేత్రాన్ని వందసార్లు దర్శిస్తే ఎంతటి పుణ్యఫలాలు ప్రాప్తిస్తాయో, 'శ్రీవాంజియం వాంజినాథ స్వామి' ఆలయాన్ని దర్శిస్తే అంతకు వీశమెత్తు అధికంగా పుణ్యఫలం లభిస్తుందని బ్రహ్మాండ పురాణం చెబుతోంది. యమభయాన్ని పోగొట్టి ముక్తిని ప్రసాదించే ఈ క్షేత్రం రాహుకేతు పరిహార స్థలంగానూ పేరుగడించింది.


ఆలయ అంతర ప్రాకారం

### స్థలపురాణం...

సకల జీవరాశులను అంత్యకాలంలో వాటి ప్రాణాలను హరించేటప్పుడు తనకు చెడ్డపేరు రావడం పట్ల యమధర్మరాజు చాలా దుఃఖిస్తుండేవారు. ఆ బాధను భరించలేక తిరువారూరు త్యాగరాజస్వామిని దర్శించి తన బాధ వెళ్ళబోసుకున్నారు. ఆ బాధను పోగొట్టుకోవాలంటే శ్రీవాంజియం క్షేత్రానికి వెళ్ళమంటూ త్యాగరాజస్వామి అశరీరవాణిగా చెబుతారు. ఆ ప్రకారం యమధర్మరాజు శ్రీవాంజియం వాంజినాథస్వామి ఆలయానికి వెళ్ళి పరమేశ్వరుడిని పూజించి ఘోరతపస్సు చేశారు. యమధర్మరాజు తపస్సు మెచ్చి పరమశివుడు మాసి నెల భరణి నక్షత్రం రోజున ప్రత్యక్షమై ఏ వరం కావాలో కోరుకోమన్నారు. సకల జీవరాశుల ప్రాణాలు హరించే బాధ్యతలో ఉండటం వల్ల అందరూ తనను పేరు వింటేనే భీతిల్లుతున్నారని, అంతేకాకుండా ప్రాణాలను హరిస్తుండటం వల్ల తనను బ్రహ్మహత్యదోషం కూడా పట్టిపీడిస్తోందని ఆ బాధల నుండి విముక్తి పొందే తరుణోపాయం చెప్పమని వేడుకున్నారు. యమధర్మరాజు కోరికను విన్న పరమశివుడు ఇకపై ఎవరూ యముడు ప్రాణాలు హరించాడని చెప్పని విధంగా వ్యాధితో, వృద్ధాప్యం వల్ల, ప్రమాదం వల్ల ఏదో ఒక సాకుతో మృతిచెందారని చెప్పేలా వరమిస్తున్నట్లు ప్రకటించారు. యమధర్మరాజు తపమాచరించిన ఈ క్షేత్రానికి పుణ్యం సంపాదించినవారిని మాత్రమే అనుమతించాలని పరమేశ్వరుడు ఆదేశించారు. ఈ క్షేత్రానికి వచ్చి దర్శనం చేసుకునేవారికి జన్మరాహిత్య ప్రాప్తి లభిస్తుందని, ఇకమీదట ఈ క్షేత్రపాలకుడిగా యమధర్మరాజే వ్యవహరించాలంటూ ఆదేశించారు. అంతేకాకుండా ఈ క్షేత్రానికి వచ్చే భక్తులు ముందుగా క్షేత్రపాలకుడైన యమధర్మరాజును దర్శించిన తర్వాతే తనను దర్శిస్తారంటూ వరమిచ్చారు. అప్పటి నుంచి ఈ క్షేత్రంలో భక్తులు ముందుగా చిత్రగుప్త సమేతుడైన యమధర్మరాజును దర్శించిన తర్వాతే వాంజినాథస్వామివారిని దర్శించటం ఆనవాయితీగా మారింది.


నయన్మార్ల విగ్రహాలు

### గుప్త గంగాతీర్థం...

సమస్త లోకులు స్నానమాచరించి పాపాల నుంచి విముక్తి చెందటంతో గంగాదేవికి ఆ పాపాలన్నీ చేరాయి. ఆ పాపాల నుండి విముక్తి కలిగించమంటూ పరమశివుడిని ప్రార్థించింది. యమధర్మరాజుకు పాపవిమోచనం కలిగించిన శ్రీవాంజియం క్షేత్రాన్ని దర్శిస్తే పాపాలన్నీ పోతాయని తెలిపారు. ఆ ప్రకారం గంగానది తన సహస్ర శాఖలలో ఒకదానిని కాశీ క్షేత్రంలో విడిచిపెట్టి, మిగిలిన 999 అంశాలతో ఇక్కడి తీర్థకొలనులో ప్రవేశించినట్లు శైవాగమ పండితులు చెబుతుంటారు. అందుకే ఈ తీర్థకొలను 'గుప్త గంగా తీర్థం' అని, 'ముని తీర్థం' 'యమతీర్థం' అని పిలుస్తున్నారు. తమిళ మాసమైన మాసి మఖం పర్వదినాన ఈ తీర్థంలో ఉత్సవాలు నిర్వహిస్తారు. పదవులు కోల్పోయినవారు, బదిలీలు ఆశించే ఉద్యోగులు, విడిపోయి కలిసి కాపురం కొనసాగించాలనుకునే దంపతులు. కార్తీక మాస ఆదివారాల్లో గుప్త గంగలో పుణ్యస్నానమాచరించి వాంజినాథస్వామిని దర్శిస్తే వారి కోరికలన్నీ నెరవేరుతాయి.


యమవాహనంపై ఊరేగుతున్న మంగళనాయకి సమేత వాంజినాథస్వామి


### ఆలయవిశేషాలు...

ప్రతియేటా ఫిబ్రవరి-మార్చి మాసాల్లో ఈ ఆలయంలో మాసి మఖం ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఈ ఉత్సవాల్లో స్వామివారు యమవాహనంలో ఊరేగటం విశేషం. తమిళమాసం కార్తీక ఆదివారాల్లో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి తీర్థవారి నిర్వహిస్తారు. ఆడి పూరం సందర్భంగా పది రోజుల బ్రహ్మోత్సవాలు కూడా జరుగుతాయి. ఈ ఆలయాన్ని రోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్ళీ మధ్యాహ్నం 3 నుండి రాత్రి 8 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఆలయానికి క్షేత్రపాలకుడిగా యమధర్మరాజు వ్యవహరిస్తుండటంతో సూర్యగ్రహణం, చంద్రగ్రహణం రోజుల్లో ఆలయాన్ని తెరచే ఉంచటం విశేషం.


### ఎలా వెళ్ళాలి?

చెన్నై సహా రాష్ట్రంలోని ప్రధాన నగరాల నుంచి కుంభకోణంకు రవాణా సంస్థ, ప్రైవేటు బస్సులు నడుపుతున్నారు. ఆ బస్సుల్లో కుంభకోణం వెళ్ళి అక్కడి నుంచి సుమారు 20 కి.మీ.ల దూరంలో ఉన్న నన్నిలం ప్రాంతంలోని ఆలయాన్ని చేరుకోవచ్చు. అత్యంత ప్రాచీనమైన ఈ ఆలయం గ్రామీణ ప్రాంతంలో ఉండటంతో భక్తులు బస చేసేందుకు కుంభకోణం, కుడవాసల్ ప్రాంతాల్లో వసతి గృహాలు, రెస్టారెంట్లు, లాడ్జిలను ఎంచుకోవాల్సి ఉంటుంది.


యమధర్మరాజు ఆలయం


ఆలయ స్థల వృక్షం - చందన వృక్షం


మంగళనాయకి అమ్మవారు


వాంజినాథస్వామి

## తెన్‌కాశి ఆలయంలో మాసి మఖ ఉత్సవాల ప్రారంభం


దేవేరులతో కొలువైన విశ్వనాథుడు


ధ్వజస్తంభానికి మహాదీపారాధన చేస్తున్న ప్రధాన అర్చకులు

చెన్నై, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశిలోని సుప్రసిద్ధ శైవాలయం కాశి విశ్వనాథర్ ఆలయంలో వార్షిక మాసి మఖం ఉత్సవాలు గురువారం ఉదయం ధ్వజారోహణతో వైభవంగా ప్రారంభమయ్యాయి. దీనిని పురస్కరించుకుని వేకువజామున మూలవర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ధ్వజ పతాకాన్ని ఆలయ ప్రాంగణంలో మంగళవాయిద్యాల నడుమ, శైవ పండితుల మంత్రోచ్చారణతో ఊరేగించారు తర్వాత ధ్వజస్తంభానికి 11 రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపి, పూలతో అలంకరించి ధ్వజారోహణం చేశారు. ధ్వజస్తంభానికి మహాదీపారాధన కూడా నిర్వహించారు. ఈ వేడుకలలో అత్యంత ప్రధానమైన రథోత్సవాన్ని ఈ నెల 23న నిర్వహించనున్నారు. ఆలయ నిర్వాహకులు, పోలీసులు ఈ ఉత్సవాలకు తగు ఏర్పాట్లు చేపడుతున్నారు.

## శ్రీవిల్లిపుత్తూరు ఆలయంలో ఓపీఎస్ పూజలు


శ్రీవిల్లిపుత్తూరు ఆలయ ఏనుగు ఆశీస్సులందుకుంటున్న పన్నీర్‌సెల్వం

చెన్నై, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే అసమ్మతి వర్గం నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం (ఓపీఎస్) గురువారం శ్రీవిల్లిపుత్తూరు ఆండాళ్ ఆలయాన్ని దర్శించారు. బుధవారం రాత్రి ఆయన రాజపాళయానికి వెళ్ళి అక్కడి గెస్ట్‌హౌస్‌లో బసచేశారు. గురువారం ఉదయం అక్కడి నుండి శ్రీవిల్లిపుత్తూరు ఆలయానికి చేరుకున్నారు. పార్టీ శ్రేణులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఆ తర్వాత ఆండాళ్‌దేవిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం కారులో బయలుదేరి పడమటి కనుమల ప్రాంతంలో ఉన్న కులదైవం వనపేచ్చి అమ్మాళ్ ఆలయానికి వెళ్లి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఓపీఎస్ రాజకీయ పరంగా కీలకమైన నిర్ణయాలు తీసుకునే సమయంలో శ్రీవిల్లిపుత్తూరు అండాళ్ ఆలయాన్ని, వనపేచ్చి అమ్మాళ్ ఆలయాన్ని దర్శించడం ఆనవాయితీ. ఆ మేరకు లోక్‌సభ ఎన్నికల్లో ఏ కూటమిలో చేరాలన్న విషయమై తుదినిర్ణయం తీసుకునేందుకే ఆయన ఈ ఆలయాలను సందర్శించినట్టు తెలుస్తోంది.

## నడిగర్ సంఘానికి మంత్రి ఉదయనిధి రూ.కోటి విరాళం


నడిగర్ సంఘం నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

నడిగర్ సంఘానికి రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడా శాఖామంత్రి ఉదయనిధి తన సొంత నిధి నుంచి కోటి రూపాయల విరాళాన్ని అందజేశారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో దీనికి సంబంధించిన చెక్కును నడిగర్ సంఘం కోశాధికారి, సినీ హీరో కార్తీ స్వీకరించారు. ఆయనతో పాటు నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్, ప్రధాన కార్యదర్శి, హీరో విశాల్, ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్ కరుణాస్ ఉన్నారు. కాగా టి.నగర్‌లో నడిగర్ సంఘానికి భవన నిర్మాణం కోసం నిధులను సేకరిస్తున్న విషయం తెల్సిందే. ఇందులో భాగంగానే సినీ హీరో అయిన ఉదయనిధి తన వంతుగా రూ.కోటి విరాళాన్ని అందజేశారు. ఆయనకు నడిగర్ సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఈ భవన నిర్మాణానికి సినీ రాజకీయ ప్రముఖులు తమవంతుగా విరాళాలివ్వాలని కోరారు. కాగా, ఈ భవన నిర్మాణం కోసం బ్యాంకు రుణం కూడా తీసుకునేందుకు నడిగర్ సంఘం ఒక తీర్మానం చేసి ఆమోదించిన విషయం తెల్సిందే.

చిత్రజ్యోతి

## కాలగర్భంలోకి మరో థియేటర్ కాంప్లెక్స్ !

నగరంలోని ప్రముఖ సినిమా థియేటర్ కాంప్లెక్స్‌ల్లో ఉదయం కాంప్లెక్స్ ఒకటి. ఈ థియేటర్ త్వరలోనే కాలగర్భంలో కలిసిపోనుంది. స్థానిక అశోక్ నగర్‌లో అశోక్ పిల్లర్, అశోక్ నగర్ మెట్రో స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ఈ థియేటర్ కాంప్లెక్స్‌లో నాలుగు స్క్రీన్‌లు ఉన్నాయి. ఉదయం, సూర్యన్, చంద్రన్‌లను మొదట నిర్మించగా, ఆధునికీకరణ పేరుతో ఉదయం థియేటర్‌లోని బాల్కనీ భాగాన్ని మినీ ఉదయంగా మార్చారు. స్థానిక అన్నాశాలైలో దేవి కాంప్లెక్స్, ఎగ్మోర్‌లోని ఆల్బర్ట్ థియేటర్ కాంప్లెక్స్‌లకు దీటుగా అశోక్ నగర్‌లో 1983లో ప్రారంభించిన ఉదయం కాంప్లెక్స్‌లో 41 యేళ్ళుగా ఎన్నో చిత్రాలను ప్రదర్శించి ప్రేక్షకులకు వినోదాన్ని అందించారు.. అశోక్ నగర్ వాసులతో పాటు వడపళని, సైదాపేట, జాఫర్‌ఖాన్ పేట, కేకే నగర్, ఈక్కాడుతాంగల్, మాంబాళం, గిండి ప్రాంతాల్లోని ప్రేక్షకులకు ఎంతో అనువుగా ఉండేది. ఈ థియేటర్‌ను ఆరుగురు అన్నదమ్ములు నిర్మించారు. వీరంతా కలిసి థియేటర్‌ను విక్రయానికి పెట్టగా, 2012లో వీరిలో ఒక సోదరుడైన పరమశివం పిళ్ళై రూ.80 కోట్లకు బిడ్డింగ్ వేశారు. ఈ థియేటర్ వేలానికిగానే ఫౌండర్స్ ఫ్యామిలీ నుంచి 53 మంది షేర్ హోల్డర్స్ తెరపైకి రావడంతో న్యాయపరమైన చిక్కులు ఉత్పన్నమయ్యాయి. ప్రస్తుతం ఈ సమస్యలన్నీ పరిష్కారం కావడంతో ఈ థియేటర్‌ను కూల్చివేసి బహుళ అంతస్తుల్లో నివాస భవన సముదాయంతో పాటు షాపులను నిర్మించనున్నట్టు వార్తలు వస్తున్నాయి.


ఉదయం థియేటర్ కాంప్లెక్స్


పూజా కార్యక్రమంలో ఆర్‌బీ చౌదరి, చిత్ర బృందం

## ఎస్‌కే - మురుగదాస్ చిత్రం షూటింగ్ ప్రారంభం

ప్రముఖ దర్శకుడు ఏఆర్.మురుగదాస్ - హీరో శివకార్తికేయన్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న చిత్రం షూటింగ్ పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. ఇందులో సీనియర్ నిర్మాత, సూపర్‌గుడ్ ఫిలిమ్స్ అధినేత ఆర్బీ చౌదరితో పలువురు సినీ ప్రముఖులు పాల్గొని చిత్ర బృందాన్ని అభినందించారు. శ్రీ లక్ష్మి మూవీస్ బ్యానరుపై భారీ బడ్జెట్‌తో రూపొందే ఈ చిత్రానికి హీరోయిన్‌గా కన్నడ నటి రుక్మిణి వసంత్‌ను ఎంపిక చేశారు. తమిళ చిత్ర పరిశ్రమలో ఎన్నో బ్లాక్‌బస్టర్ చిత్రాలను అందించిన శివకార్తికేయన్, భారీ కమర్షియల్ చిత్రాలకు కొత్త గ్లామర్ అందించిన దర్శకుడు ఏఆర్.మురుగదాస్ కాంబినేషన్‌లో రానున్న ఈ చిత్రంపై ఇప్పటినుంచే సినీ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మురుగదాస్ తన ట్రేడ్‌మార్క్ థ్రిల్లింగ్ స్క్రీన్‌ప్లేతో, వైవిధ్యభరితమైన అంశాలతో యాక్షన్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు.

## విడుదలకు సిద్ధమైన 'అంజాం వేదం'

విహాన్ విష్ణు - సును లక్ష్మీ జంటగా నటించిన 'అంజాం వేదం' చిత్రం ఈ నెల 23న విడుదలకు సిద్ధమైంది. తమిళం, మలయాళ భాషల్లో తెరకెక్కిన ఈ సినిమా ద్వారా ముజీబ్ టి.మొహమ్మద్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. నిర్మాత హబీబ్ అబూబాకర్ నిర్మించగా, సాగర్ అయ్యప్పన్ ఛాయాగ్రహణం సమకూర్చారు. ఈ చిత్రం గురించి దర్శకుడు ముజీబ్ డి మహమ్మద్ వివరిస్తూ, 'ఒక కుటుంబం, ఒక వ్యక్తి జీవితంలో మతం జోక్యం ఎలా ఉంటుందన్న విషయాన్ని వివరిస్తుంది. ఇందులో అనేక రహస్యమైన చిక్కులు, ట్విస్టులు, పజిల్స్, మలుపులున్నాయి. కేరళ రాష్ట్రంలోని ఒక గిరిజన గ్రామంలో చిత్రీకరించాం. మతపరమైన సిద్ధాంతాలు, విశ్వాసాలు, ఛాందసవాదం, హింస తదితర అంశాలను కూడా టచ్ చేస్తుంది. ప్రతి సీన్ ఎంతో ఉత్కంఠతకు గురిచేస్తుంది. రెండు తమిళ చిత్రాలకు పనిచేసిన పినీష్ రాజ్. ఈ చిత్రానికి సంభాషణలు రాయడంతో పాటు కో-డైరెక్టరుగా పనిచేశారు. ఈ సినిమాలో ప్రారంభం నుంచి ముగింపువరకు కనిపించే అనేక అందమైన లోకేషన్లు పూర్తిగా విజువల్ ఎఫెక్ట్ టెక్నాలజీతో సృష్టించాం. సాధారణంగా చిన్న చిత్రాలకు భారీ వ్యయంతో కూడిన వీజువల్ ఎఫెక్ట్ టెక్నాలజీని ఉపయోగించరు. కానీ, ప్రేక్షకులకు సరికొత్త అనుభవం అందించాలన్న ఉద్దేశ్యంతో ఈ టెక్నాలజీని ఉపయోగించాం' అని వివరించారు.


'అంజాం వేదం'లో ఓ దృశ్యం



కార్యక్రమంలో ప్రముఖులు

## ఘనంగా ఎస్వీ హైస్కూల్ ద్వితీయ క్రీడా వార్షికోత్సవం

అడయార్, ఫిబ్రవరి 15: స్థానిక వానగరంలోని ఎస్వీ హైస్కూల్ ద్వితీయ క్రీడా వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన ప్రచారం కూడా నిర్వహించారు. ఈ స్పోర్ట్స్ డేకు విరుగంబాక్కం రేంజ్ పోలీస్ అసిస్టెంట్ కమిషనర్ సుబ్రమణియన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ విద్యార్థుల్లో ఫోన్ వినియోగం అధికమైందని, ఇది కలిగిస్తుందన్నారు. విద్యార్థుల శారీరక, మానసిక శ్రేయస్సును మెరుగుపరుచుకునే విషయంపై దృష్టిసారించాలని ఆయన సూచించారు. అలాగే, విద్యార్థులు ఔట్‌డోర్ యాక్టివిటీల్లో ఎక్కువగా పాల్గొంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అవర్చుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్వీ హైస్కూల్ ఎండీ రాజీవ్ కృష్ణ, ఛైర్మన్ రామచంద్రన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మౌష్మి రాజీవ్, ప్రిన్సిపాల్ చిట్టు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అన్నాడీఎంకేలో చేరిన బీజేపీ నాయకురాలు

ప్యారీస్, ఫిబ్రవరి 15: బీజేపీ దక్షిణ రాష్ట్రాల మైనార్టీ సెల్ ఆర్గనైజర్ ఫాతిమా అలి అన్నాడీఎంకేలో చేరారు. అడయార్ గ్రీన్‌వేస్ రోడ్డులోని కార్యాలయంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సమక్షంలో గురువారం ఫాతిమా అలి పార్టీలో చేరారు. ఆమెకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. తమిళనాడు, పుదుచ్చేరి ముస్లిం రాష్ట్రీయ మంచ్ రాష్ట్ర అధ్యక్షురాలిగా కూడా ఫాతిమా వ్యవహరించారు. బీజేపీలో మైనార్టీలకు న్యాయం జరగడం లేదని, మసీదులు కూల్చివేస్తున్నారని, వాటిని జీర్ణించుకోలేక ఆ పార్టీ నుంచి వైదొలిగినట్లు ఆమె తెలిపారు.


ఈపీఎస్ సమక్షంలో అన్నాడీఎంకేలో చేరిన ఫాతిమా